క్లుప్తంగా

ఘనంగా రంగస్థల దినోత్సవం


రంగస్థల నటుడు బుజ్జయ్యకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : బాలాజీ నగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచేది రంగస్థలమన్నారు. ఈ సందర్భంగా కోవూరుకు చెందిన రంగస్థల కళాకారుడు పోట్లదుర్తి బుజ్జయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఎ.జయప్రకాష్, రాచపాళెం రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆనంతో డివిజన్ నాయకుల భేటీ


ఆనం విజయకుమార్‌రెడ్డితో 23వ డివిజన్ నాయకులు

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో 23వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలపై చర్చించారు.

అన్నదానం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్దాస్పత్రిలో గురువారం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యుడు అక్కులూరి శ్రీనివాసులురెడ్డి మనుమడు సిద్ధార్థ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 300 మందికి శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ కార్యాలయంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు స్వర్ణా రమేష్, అజయ్‌దేవ్, సుబ్బారెడ్డి, గఫర్, యల్లారెడ్డి, సీవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం అందాలి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : దేశవ్యాప్తంగా ప్రతి పేదవాడికి పూర్తిస్థాయిలో ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. వేదాయపాళెంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న అనేక అంశాలపై మాట్లాడారు. అనంతరం సంఘ సిటీ గౌరవాధ్యక్షుడు వంజివాక శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో ఎస్.విజయ్, కె.రాజాచారి, ఎస్.మధు, శ్రీనివాసులు, ఎ.మురళీ పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమావేశం


మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం) : రంజాన్ పండగ నిర్వహణకు సంబంధించి నగరంలోని బారాషహీద్ దర్గా ఈద్గా మైదానంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని మసీదులు, ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, మతపెద్దలు పాల్గొన్నారు.

అకౌంట్స్ అధికారులకు మేయర్ అభినందన

నెల్లూరు(బారకాసు) : 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికాబద్ధమైన బడ్జెట్‌ను రూపొందించిన నగరపాలక సంస్థ అకౌంట్స్ విభాగాధికారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు మేయర్ స్రవంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ సమావేశాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కమిషనర్ సూర్యతేజ, అకౌంట్స్ విభాగం వారి పాత్ర ప్రశంసనీయమన్నారు.

మొబైల్ ఘుమఘుమలు

- ధర తక్కువ.. నాణ్యత ఎక్కువ
- రోడ్ల వెంబడి విస్తారంగా మొబైల్ వాహనాలు
- రకరకాల రుచులతో ప్రజలకు అందిస్తూ..


నగరంలోని ఓ మొబైల్ వాహనం

నెల్లూరు (పొగతోట) : నగరంలోని రోడ్లపై మొబైల్ వాహనాల భోజనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. మినీబైపాస్ రోడ్డు, నర్తకీ సెంటర్, చిల్డ్రన్స్ పార్కు తదితర ప్రాంతాల్లో మొబైల్ వాహనాలు అధికంగా ఉన్నాయి. రూ.20కే నోరూరించే వెరైటీ రైస్ వినియోగదారులకు అందిస్తున్నారు. వెజిటేబుల్ రైస్, బీరకాయ రైస్, ఆకుకూర రైస్, సాంబార్ రైస్, పెరుగన్నం, ఉసరికాయ పులిహోర, కరివేపాకు రైస్, మష్రూమ్ రైస్, గోబీరైస్, ఇలా రకరకాల వంటకాలతో ప్రజలను ఆకర్షిస్తున్నారు.

ఆకర్షించేలా..

ప్రజలు మొబైల్ వాహనాల వైపు అధికంగా ఆకర్షితులవుతున్నారు. దీంతో వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉండడంతో పుట్టగొడుగుల్లా మొబైల్ వాహనాలు వెలుస్తున్నాయి. పేద, మధ్య తరగతి, బడా బాబులు సైతం రోడ్డు పక్కనే కార్లను పార్క్ చేసి మొబైల్ వాహనాల వద్ద భోజనం చేస్తున్నారు. ధర తక్కువ, నాణ్యత, రుచికరంగా అందిస్తుండడంతో ప్రజలు మొబైల్ వాహనాలపై మొగ్గు చూపుతున్నారు. మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మొబైల్ వాహనాల వద్ద ప్రజలు తాకిడి అధికంగా ఉంటుంది. ఆటోవాలాలు, కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు సైతం మొబైల్ వాహనాలపై మక్కువ చూపుతున్నారు.

వాటి వైపే మొగ్గు

నగరంలో సుమారు 8 లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు. నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. నగర ప్రజలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు మొబైల్ వాహనాల వద్దే భోజనాలు చేస్తున్నారు. స్టార్ హోటల్స్, దాబాలకు వెళ్తే బిల్లు అధికమవడంతో పాటు సమయం వృథా అవుతుందని మొబైల్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. నగరంలో ప్రధాన కూడళ్లలో మొబైల్ వాహనాలు అధికంగా ఏర్పాటు చేసి ఉన్నారు. మొబైల్ వాహనాలతో పాటు బిర్యాన్ని బండ్లు, షాపులు, అధికంగా వెలుస్తున్నాయి. ఎన్ని వాహనాలు పెట్టినా రద్దీ అధికంగానే ఉంటుంది.

రుచికరంగా ఉంటున్నాయి

మొబైల్ వాహనాల్లో భోజనాలు రుచికరంగా ఉంటున్నాయి. నాణ్యతతో పాటు ధర తక్కువగా ఉంటుంది. అందుకే అధిక శాతం మంది ప్రజలు మొబైల్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ధర తక్కువ, శుభ్రత, ఏరోజుకు ఆ రోజే భోజనాలు అందిస్తున్నారు. దీంతో ప్రజలు ఇటువైపు మొగ్గు చూపుతున్నారు.


– హుస్సేన్, నగర వాసి

ప్రజల అభిరుచి మేరకే..

ప్రజల అభిరుచి మేరకే రకరకాల వంటకాలను సిద్ధం చేస్తున్నాం. నాణ్యతా లోపం లేకుండా ధర తక్కువగా రుచికరంగా ప్రజలకు అందిస్తున్నాం. దీంతో ప్రజలు ఇష్టంగా భోజనం చేస్తున్నారు.

– బాలసుబ్రహ్మణ్యం, మొబైల్ వాహన నిర్వాహకుడు

ఆదిశేషారెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న విజయకుమార్‌రెడ్డి, అరుణమ్మ


నివాళులర్పిస్తున్న ఆదాల

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని పెనుబర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తండ్రి ఆదిశేషారెడ్డి ఉత్తరక్రియలు గురువారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పాల్గొని, ఆదిశేషారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పెనుబర్తి గ్రామంలో జరిగిన వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తండ్రి ఆదిశేషారెడ్డి ఉత్తరక్రియలకు మాజీ ఎంపీ, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నాయకులు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, మల్లు సుధాకర్‌రెడ్డి, సీహెచ్ హరిబాబుయాదవ్, నాగా శ్రీనివాసులురెడ్డి, కల్లూరు లక్ష్మిరెడ్డి, షేక్.అల్లాభక్షు, బెల్లంకొండ వెంకయ్య పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.మోహన్‌రావు పిలుపునిచ్చారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముత్తుకూరు ప్రాంతంలోని నేలటూరు గ్రామ ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకుని కేన్సర్, చర్మ వ్యాధులతో అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే ఇందుకూరుపేట మండలంలో మత్స్యకార కుటుంబాలు చేపల వేటకు వెళ్లాలంటే ఉప్పుకాలువను దాటివెళ్లే వంతెన కూలిపోయిందని, దీనిని నిర్మాణాన్ని డిమాండ్ చేశారు. సోమశిల హైలెవల్ కెనాల్, వెలుగొండ లాంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, రామాయపట్నం పోర్టుకు సంబంధించిన నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం 29వ తేదీ నగరంలోని వీఆర్సీ మైదానం నుంచి ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపడుతామన్నారు. పార్టీ నేతలు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్ దుకాణాలకు వేలంపాట


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని మార్కెట్లు, గౌర్రెలు, పశువుల గంజిఖానాలకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ బహిరంగ వేలాన్ని ఎస్ఎంసీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. డైకస్‌రోడ్డు గొర్రెల గంజి ఖానాను రూ.3,42,000లకు, డైకస్‌రోడ్డు చేపల మార్కెట్‌ను రూ.8,14,000లకు, అదే మార్కెట్‌లో చేపలను శుభ్రపరచగా వచ్చే వ్యర్థాల కోసం రూ.3,02,000లకు పాటదారులు 12 నెలల కాలపరిమితికి సొంతం చేసుకున్నారు. కాగా డైకస్‌రోడ్డు పశువుల గంజిఖానా, సంతపేట పశువుల గంజిఖానాలు వాయిదా వేశారు. శెట్టిగుంట రోడ్డు చేపల మార్కెట్టు, మైపాడు రోడ్డు చేపల మార్కెట్ల కోసం పాటదారులెవరూ పాల్గొనలేదు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పర్వతరెడ్డి ఆధ్వర్యంలో తోఫా పంపిణీ


తోఫా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగర నియోజకవర్గంలోని ఇమామ్‌లు, మౌజాన్‌లకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రంజాన్ తోఫాను గురువారం అందజేశారు. నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపి సరుకులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేశారని గుర్తుచేశారు.

పలు మసీదులకు..

నగరంలోని పలు మసీదులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి స్వయంగా వెళ్లి రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కలెక్టర్‌కు ధన్యవాదాలు

నెల్లూరురూరల్ : కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల వేతనాల సమస్యకు పరిష్కార దిశగా కలెక్టర్ ఆనంద్ సీఎం చంద్రబాబుతో చర్చించినందుకు బీజేపీ నేత మిడతల రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఫ్యాక్టరీ స్థలాన్ని నుడా పరిధిలోకి తెచ్చేందుకు కృషి చేయాలని నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డిని ఆయన కార్యాలయంలో గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. 108 ఎకరాలకుపైగా ఉన్న షుగర్ ఫ్యాక్టరీ స్థలం పరిశ్రమలకు కేటాయిస్తే పెన్నా పరీవాహక ప్రాంతంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు కాలుష్యం బారిన పడతాయని, పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని ఆ స్థలాన్ని నుడా పరిధిలోకి తీసుకొస్తే ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుందన్నారు.

అప్పల బాధ తాళలేక..

నెల్లూరు(క్రైమ్) : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. గోమతినగర్‌లో సుధాకర్(52), లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. సుధాకర్ మద్రాసు బస్టాండు సమీపంలో కంప్యూటర్స్ షాపు నిర్వహిస్తున్నారు. ఆయన ఇటీవల అప్పులపాలయ్యారు. దీంతో ఈనెల 24న ఆయన తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని భార్య, కుమారుడు చికిత్స నిమిత్తం జయభారత్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈమేరకు మృతుని భార్య దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్సీతో డివిజన్ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : డివిజన్లలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. 5, 16వ డివిజన్ల వైఎస్సార్‌సీపీ నేతలు రాంజీనగర్‌లోని కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీతో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. డివిజన్ ఇన్‌చార్జి సగిలి జయరామిరెడ్డి, నాయకులు మణి, మస్తానయ్య, సాంబమ్మ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

నెల్లూరు (టౌన్) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రసూతి ఓపీ విభాగాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మడపర్తి శ్రీనివాసులుగౌడ్, వీర బ్రహ్మరెడ్డి, మొగరాల సురేష్, దారా మల్లి, సుల్తానా పాల్గొన్నారు.

నారాయణను బర్తరఫ్ చేయాలి

నెల్లూరురూరల్ : పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగును అడ్డుకుంటున్న మంత్రి నారాయణను వెంటనే బర్తరఫ్ చేయాలని ఆర్పీఐ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ బొమ్మ వద్ద ఉన్న ఆర్పీఐ జిల్లా కార్యాలయంలో వారు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో మూడు వేల కుటుంబాలకు నారాయణ అన్యాయం చేశారని, వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కోవూరు సురేష్, బత్తల మధుసూదన్, వల్లూరు ధనుంజయ పాల్గొన్నారు.

కాకాణికి మద్దతుగా..



నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా మద్దతు తెలుపుతున్నారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న ఆయన నివాసం వద్దకు గురువారం రాత్రి పార్టీ నేతలు చేరుకుని కాకాణిని అక్రమంగా అరెస్ట్ చేస్తే ఊరుకోమంటూ నినాదాలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు

ఉగాది పద్యకవి సమ్మేళనం


పాల్గొన్న కవులు

నెల్లూరు(బృందావనం) : గోమతినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఉగాది పద్యకవి సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. సుభద్రాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత దివంగత టీటీడీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు అన్నమయ్య కీర్తనలు ఆలపించి నీరాజనం పలికారు. ఈ సందర్భంగా పలువురు తమ కవితలు వినిపించారు. అనంతరం వారిని సత్కరించారు. గిరిజాలక్ష్మి, పి.నరసింహారావు, బృందావనరావు, ఐ.మధుసూదన్‌రావు, సుహాసిని పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు (పొగతోట) : స్వయం సహాయక గ్రూపు మహిళల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీపీఎంలు, ఏసీలు, ఎంపీఎంలతో నిర్వహించిన సమావేశంలో పీడీ గురువారం మాట్లాడారు. రుణ అవసరాలు, జీవనోపాధుల ప్రణాళిక ద్వారా ఎస్‌హెచ్‌జీలకు ఫైనాన్స్, డిజిటల్ లిట్రసీపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలా 7లోపు రుణ అవసరాలు, జీవనోపాధుల ప్రణాళికను పూర్తి చేసి పీడీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వాలి

- కమిషనర్ సూర్యతేజ


గాంధీ గిరిజన కాలనీ వాసులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు) : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన దగ్గర వెంటనే అన్ని గృహాలను అనుసంధానం చేస్తూ కనెక్షన్లు ఇవ్వాలని పబ్లిక్ హెల్త్ అధికారులకు కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా స్థానిక 53వ డివిజన్ పెట్రోల్ బంక్ డౌన్ గాంధీ గిరిజన కాలనీ, వారధి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. పెట్రోల్ బంక్ డౌన్ వద్ద నివసిస్తున్న వారికి టిడ్కో సముదాయంలో ఇళ్లు ఇవ్వాలన్నారు. గతంలో ఇళ్లు మంజూరై నిర్మాణ పనులు పూర్తికాని గృహాలను వెంటనే పూర్తి చేయించి స్థానికులను అక్కడికి తరలించాలని, అక్కడే వారికి పెన్షన్లు, రేషన్ తదితర సేవలు అందేలా చూడాలన్నారు. అలాగే ఉచిత సోలార్ పథకాలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా చూడాలన్నారు. స్థానిక సచివాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పిల్లలకు ఆట వస్తువులను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. గాంధీనగర్ గిరిజన కాలనీలో నివసిస్తున్న వారికి ఆధార్ నమోదు, చిన్నపిల్లలకు హెల్త్ చెకప్, వాక్సినేషన్, అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, చదువుల గురించి మెప్మా వారికి తగిన సూచనలు ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సుజాత, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహనరావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, డీఈ రఘురాం, ఎలక్ట్రికల్ ఏఈ రమణారెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచి ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 29 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఉగాది, శ్రీరామనవమి మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని మందిర కమిటీ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను సాయిమాత ప్రసాదాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 29న శనివారం ఉదయం 6 నుంచి ఏప్రిల్ 5వ తేదీ శనివారం ఉదయం 6 గంటల వరకు ఏడు రోజుల పాటు అఖండ సాయి నామ సంకీర్తన సప్తాహ మహాయజ్ఞం జరుగుతుందన్నారు. తొలిరోజు అఖండజ్యోతి ప్రజ్వలన ఉంటుందన్నారు. ఉగాది, శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రత్యేకాలంకరణలు, పూజలు ఉంటాయన్నారు. ఏప్రిల్ 13న ఆదివారం ఉదయం 9 గంటలకు మందిరంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కొలొరెక్టల్ కేన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న అపోలో కేన్సర్ వైద్య నిపుణుడు శ్రీరామ్‌సతీష్

నెల్లూరు (టౌన్) : ప్రస్తుత యువతలో కొలొరెక్టల్ కేన్సర్ (పెద్దపేగు సంబంధ కేన్సర్) ఎక్కువగా వస్తోందని, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అపోలో కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీరామ్‌సతీష్ తెలిపారు. స్థానిక అపోలో ఆస్పత్రిలో కొలొరెక్టల్ కేన్సర్‌పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలొరెక్టల్ కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే జయించవచ్చన్నారు. మలంలో రక్తం రావడం, ఎక్కువగా బరువు తగ్గిపోవడం, నిరంతరం కడుపునొప్పిగా ఉండటం, వాంతులు కావడం ఈ కేన్సర్ లక్షణాలని తెలిపారు. అపోలో ఆస్పత్రుల్లో కొలొరెక్టల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, చికిత్సను తక్కువ ఫీజుతో చేస్తున్నట్లు చెప్పారు. కేన్సర్ వైద్య నిపుణురాలు హరిత, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు నితీష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ హిమబిందు, ఆస్పత్రి యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయండి

- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు


అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో

నెల్లూరురూరల్ : భూముల రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు కింద 11 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపిక చేసిన ఎఫ్‌లైన్ సర్వే, పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. రీసర్వే గ్రామాల్లో విలేజ్ బౌండరీ, గ్రౌండ్ ట్రూతింగ్, భూ విస్తీర్ణం, జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలైన్లు వంటి ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ అనూష, జిల్లా భూసర్వే రికార్డుల ఏడీ నాగశేఖర్ పాల్గొన్నారు.